# ఇంటి పుల్లకూర

యండమూరి వీరేంద్రనాథ్



బ్లాంకెట్ కొద్దిగా తొలిగించి, ఒక కన్ను తెరిచి చూసింది సుమిత్ర. రావ్ లేచి, మంచంమీద దుప్పటి సరిగ్గా సర్దటం బెడ్‌లైట్ కాంతిలో కనిపిస్తూంది.

అంటే నాలుగన్నరయిందన్నమాట

డిసెంబర్ వచ్చేకి బ్లాంకెట్‌లోంచి శరీరం వణుకుతూంది డిసెంబరయినా ఏప్రిలయినా రావు నాలుగున్నరకే లేస్తాడు.

సుమిత్ర మళ్ళీ బ్లాంకెట్ కప్పుకుంది.

ఆమె లేచేసరికి ఆరున్నర అవుతుంది.

అప్పటికి అతగ మార్నింగ్ వాక్‌కి వెళ్ళి రావటం, షేవ్ చేసుకోవటం, స్నానం చెయ్యటం కూడా అయిపోతుంది ఆ తర్వాత అతడు టైప్ మిషన్ ముందు కూర్చొని ప్రైవేట్‌గా చేస్తున్న జాబ్ వర్క్ మొదలుపెడ్తాడు. లాయర్ల తాలూకు పేపర్లు టైప్ చేసినందుకు అతడికి నెలకో రెండొందలదాకా వస్తుంది.

తొమ్మిదింటికి అతడు సైకిల్ మీద పిల్లలిద్దర్ని ముందూ వెనకా ఎక్కించుకొని స్కూల్లో దింపివస్తాడు.

ఎన్నో సంవత్సరాలనుంచీ జరుగుతున్న కార్యక్రమం ఇది

పెళ్ళయిన కొత్తలో భర్తమీద గౌరవంకొద్దీ తనూ లేవటానికి ప్రయత్నించింది. కుదర్లేదు. తరువాత ఆర్నెల్లకి భర్తమీద కమేండ్ వచ్చి తనతోపాటూ ఆరున్నరవరకూ 'ఉంచుకోవటానికి' ప్రయత్నించింది అదీ కుదరలేదు

అలాగే ఎనిమిదేళ్ళు గడిచిపోయినయ్.

రావ్‌దంతా టైమ్ ప్రకారం నడవటం. జీవితంపట్ల సిన్సియారిటీ స్ఫుటంగా కనిపిస్తూ వుంటుంది అతడి ప్రతి పనిలో.

అదే నచ్చదు సుమిత్రకి.

రావ్‌తో కాపురం ప్రారంభించి ఎనిమిదేళ్ళు కావొస్తున్నా పూర్తిగా ఎడ్జస్ట్ కాలేకపోయింది సుమిత్ర అయితే దానిక్కారణం ఆవతలివాళ్ళదే అని ఇద్దరి అభిప్రాయం

మంచి రొమాంటిక్ మూడ్‌లో లేచి మంచం దిగుతాడు.

"ఏమైంది" అడుగుతుంది

"ఆ మూల చూడు గోడకి బూజు" అంటాడు. లాగితందామన్నంత కోపం వస్తుంది దాన్ని అణిచిపెట్టుకొని "రేపొద్దున్న తీయొచ్చుగా" అంటుంది.

"అసలివ్వాళ మధ్యాహ్నమే దాన్ని గమనించి నువ్వు తీయాల్సింది. అవును సుమిత్రా – నువ్వు పగలంతా, నేను ఆఫీసు కెళ్ళిపోయిన తర్వాత ఏం చేస్తావు ?" స్టూలు మూలకి లాగుతూ, పాతచీపురు బూజు దులపటానికి పట్టుకొని అతడు అడిగేడు

"పక్కింటి రుక్మిణి దగ్గిర కూర్చుంటాను" అంది వళ్ళు మండి.

* * *

అదే టైమ్‌కి పక్కింట్లో "ఏమండీ – లేవండీ" అంది రుక్మిణి మొగుణ్ణి కుదుపుతూ. నారాయణ్ 'ఊ' అంటూ మూల్గి ఇట్నుంచి అటు తిరిగి పడుకొన్నాడు.

"హిందీలో వార్తలు కూడా అయిపోవస్తున్నాయి లేవండీ" దుప్పటి లాగుతూ అంది అతడు చప్పున ఆమెని లోపలికి లాక్కున్నాడు రెండు నిముషాల తర్వాత ఆమె అతికష్టంమీద బైటపడి "స్నానంచేసి ఏం లాభం – తలంతా మళ్ళీ దువ్వుకోవాలి ఖర్మ" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

తరువాత అరగంటకి నారాయణ్ లేచేడు "ఒరేయ్ లేవరా" అంటూ బాబిగాణ్ణి లేపేడు

తండ్రీకొడుకులిద్దరూ బ్రెష్‌లు నోట్లో పెట్టుకొని పెరట్లోకి వచ్చేరు

రుక్మిణి "వేణ్ణీళ్ళు పెట్టనా" అంది

నారాయణ్ భారంగా మూలిగి, "ఊ" అన్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది అరగంటసేపు తోమీ తోమీ – కొడుకుతో తోమించి, లోపలికి వచ్చేరు. ఈలోగా రుక్మిణి వేణ్ణీళ్ళు పెట్టింది

"ఈరోజేం కూర డియర్" అంటూ వంటింట్లోకి ప్రవేశించి, మూకుడులోవున్న దొండకాయవేపుడు ముక్కలు ఒకొక్కటే తీసి నోట్లో వేసుకోసాగేడు రుక్మిణి తల కొట్టుకొని "అబ్బా – మళ్ళీ ఇక్కడ చేరేరూ – నీళ్ళు చల్లారిపోతున్నాయి అక్కడ. వెళ్ళండీ" అని బలవంతంగా బైటకి తోసింది

బాబిగాణ్ణి స్కూలుకి తీసుకెళ్ళటం నారాయణ్‌కి ప్రతి రోజూ ప్రాబ్లమే వాణ్ణి దించి

వచ్చేక వంటింట్లో చేరేడు మళ్ళీ "చార్లో తాలింపు పెట్టటం నీకు రాదోయ్" అంటూ.

"నాకొచ్చుగానీ, మీరు బైటకి వెళ్ళండి" అంది

దాన్ని వినిపించుకోకుండా పోపుల డబ్బా తీసుకొని ఎండుమిరపకాయలు గిల్లి ప్లేట్లో వేయసాగేడు. రుక్మిణి పొయ్యిమీద మూకుడు పెట్టి నూనె కాగిందా లేదా అని చూస్తూంది.

పెరట్లో కొచ్చిన సుమిత్ర కిటికీలోంచి వీళ్ళిద్దర్నీ చూస్తూంది.

* * *

'సుమీ' అంటూ లోపలికి వచ్చేడు రావు "చూడు నీకు ఏం ప్రజంటేషన్ తెచ్చానో."

"ఏమిటి" బైటకొచ్చి చూసింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యేయి రావు నవ్వుతూ చూస్తున్నాడు.

"స్కూటర్ ?" అంది

నవ్వుతూ తలూపేడు ఆమె కళ్ళని నమ్మలేక "కొన్నారా" అంది

"మరి ?"

"ఓ డియర్" అంటూ గాలిలా దగ్గరకి వెళ్ళి అతడి మెడచుట్టూ చేతులువేసి ముద్దు పెట్టుకొంది అతను కదలకుండా అలానే నిలబడి, "సుమిత్రా – ఒక్క మాట జవాబు చెప్పు ఇదంతా నామీద ప్రేమా – స్కూటర్‌మీదా ?" అని అడిగేడు

ఆమె చప్పున చేతులు తీసేసి కొరకొరా చూస్తూ "యూ ఆరెన్ ఇడియెట్" అంది కోపంగా

అయితే ఆ కోపం రాత్రి తొమ్మిదయ్యేసరికి తగ్గిపోయింది. నెమ్మదిగా అతడి దగ్గిర జేరి, 'సెకెండ్ షోకి వెళ్దామా' అంది లాలనగా.

ఆ రోజే కొత్తగా కొన్న స్కూటర్‌మీద ఎక్కాలని – భర్తతో కల్సి సినిమా చూడాలని ఆమె మనసునిండా కోర్కె నిండుకొంది. అయితే దాన్ని అతడు గుర్తించలేదు. టైప్‌మిషన్ ముందు కూర్చున్నవాడల్లా తలెత్తి నిదానంగా ఆమెవైపు చూసేడు

"ఈ పేపర్లు టైప్ చెయ్యటం రాత్రికి పూర్తవ్వాలి. లేకపోతే లాయరుగారు జాబ్‌వర్క్ తాలూకు డబ్బు ఇవ్వరు" అన్నాడు

"డబ్బు – డబ్బు – డబ్బు" అంది విసుగ్గా "ఎప్పుడూ డబ్బేనా –"

"మరి ఆ డబ్బే లేకపోతే ఈరోజు స్కూటర్ ఎలా వచ్చేది ?" అని లేచి, ఆమె దగ్గిరకి వచ్చి అన్నాడు, "చూడు సుమీ – కలల్లో బ్రతకటం వేరు కలల్ని నిజం చేసుకోవటానికి ప్రయత్నించటం వేరు మనం రెండోవర్గానికి చెందాలని నేను కోరుకొంటున్నాను"

"భార్యతో సినిమాకి వెళ్ళటంలో తప్పేం వుంది ?"

"ఈ అర్ధరాత్రివూట నిద్ర మానుకొని సెకెండ్‌షోకి వెళ్ళకపోతేనేం ? దీనివల్ల ఈరోజు పని నష్టం రేపు ఆఫీసులో పని కష్టం"

ఆమె అతనివైపు ఉక్రోషంగా చూసి అన్నది, "నీ అంత క్యాలిక్యులేటెడ్‌గా బ్రతికేవాడితో ఏ ఆడదీ కాపురం చెయ్యలేదు రావ్ నిజం"

అంతలో ఆమెకి రోడ్డుమీద నారాయణ్ దంపతులు కనపడ్డారు "అదిగో, ఆ రుక్మిణిని చూడు ఎంతదృష్టవంతురాలో మొగుడూ పెళ్ళాం అంటే అలావుండాలి ఆ నారాయణ్ వంటింట్లో భార్యకి సాయం చేస్తాడు. పిల్లలకి దగ్గిరుండి స్నానం చేయిస్తాడు అతణ్ణి చూసి బుద్ధి తెచ్చుకో దేనికైనా పెట్టిపుట్టాలి హూ–" అని విసవిసా లోపలికి వెళ్ళిపోయింది, "ఆ రుక్మిణి అదృష్టం ఎవరికీ రాదు" అనుకొంటూ.

* * *

ఆ మరుసటిరోజు రుక్మిణి సుమిత్ర దగ్గిరకి వచ్చింది ఓ గ్లాసుడు పంచదారుంటే ఇమ్మని

"ఎవరో వచ్చినట్టున్నారు" అడిగింది సుమిత్ర

"అవును వదినగారూ ! మా క్లాస్‌మేట్సు ఇక్కడో స్నేహితురాలి పెళ్ళంటే వచ్చారు" అని తమింటివైపు చూసింది

ఆమె మొహం వాడిపోయింది కొద్దిగా వాళ్ల మధ్య ఒక కుర్చీలో నారాయణ్ కూర్చొని కబుర్లు చెబుతున్నాడు వళ్ళో కొడుకు కూర్చొని వున్నాడు నారాయణ్ వంటిమీద చొక్కా, బనీనూ లేవు

"ఈయనకి బుద్ధిరాదు వదినగారూ ! అన్నీ ఆడంగిచేష్టలే–" అని గ్లాసు తీసుకొంటూ అంది – "మీఆయన్ని చూస్తే ముచ్చటేస్తూంది అన్నీ టైమ్ ప్రకారం చేస్తారు స్కూటర్ కూడా కొన్నారుకదా మొగాడంటే అలావుండాలి వదినగారూ మా ఆయనా వున్నాడెందుకు - వంటింట్లో చేరి కబుర్లు చెప్పమంటే మాత్రం తయారు మహాబద్ధకస్తుడు. అర్ధరాత్రివూట హఠాత్తుగా మూడ్ వస్తే సినిమా అంటారు ప్రొద్దున్న తొమ్మిదింటి వరకూ లేవరు ఈయనతో వేగలేక ఛస్తున్నాను వదినగారూ ! మీ అదృష్టం ఎవరికీ రాదనుకోండి–" ఆమె చెప్పుకుపోతూంది

సుమిత్ర తెల్లబోయి చూస్తూనేవుంది

